ఏమోలేదు

రైలు జోరుగా వెడుతోంది — మెయిలు అవడంవల్ల దూరంగా కొండలూ చెట్లూ అక్కడక్కడ గుడిసెలూ, భూమికి పైత్యం కలిగి గుండ్రంగా తిరుగుతున్నట్టున్నాయి. రైలుపెట్టెలో వేడిగాడ్పు — సాయంత్రం ఆరుగంటలయినా చీకాకుగా వీస్తోంది. ఇంజను నిట్టూర్పులలోని బొగ్గుమసి బట్టల్ని ఖరాబు చేస్తోంది. అసలా సాయంత్రమే ఎంతో కష్టంగా చైతన్యరహితంగా వుంది సంధ్యవేళ. దూరంగా కనపడీ, కనపడని కొండలు ముసుగులు కప్పుకుని రాత్రి సంచారానికి తయారౌతూన్న దెయ్యాలలాగ వున్నాయి. మూడవక్లాసు పెట్టె ఎప్పటిలాగే దేశసౌభాగ్యాన్ని ప్రతిఫలిస్తోంది. నా పక్కనే కూర్చున్న ఆసామీ కాండ్రించి చుట్టరసాన్ని ఉమ్మేస్తున్నాడు. అంగవస్త్రపు గుడ్డా, రాగి చెంబూ అభరణాలుగా గల ఒక శాస్త్రులుగారు పెట్టెలో మూలగా బిక్కమొహం పెట్టుకొని కూర్చున్నాడు — వర్ణాశ్రమ సంకరానికి బాధపడుతున్నాడేమో ! ఒక వర్తకుడు ఆ చివరా, ఈ చివరా కాళీవున్నా, మధ్యగా కూర్చుని సీటు అంచుల్ని చేత్తో గట్టిగా పట్టుకున్నాడు. విసురుకి సీటుమీద నుండి జారి రైలులోంచి కిందికి పడిపోతానని భయం కాబోలు. చీటికీ మాటికీ పక్కనున్న ట్రంకుపెట్టెకేసి చూస్తున్నాడు. ఆ చూపులో ఏదో కొంచెం ప్రేమలాంటి అనురాగం వుట్టిపడుతోంది. కాలేజీ విద్యార్థులు సెలవులకి కాబోలు యిళ్ళకివెళ్ళే హడావిడిలో వున్నారు. ఇంకా రకరకాల మనుష్యులూ, ముసుగున్న ఒక హీన రకం ఆంగ్లో ఇండియన్ యువతీ కూడా పెట్టెలో వున్నారు. కాలేజీ విద్యార్థులు కళ్ళజోడు పెట్టుకుని కూర్చున్న ఒక బెంగాలీతో కబుర్లు చెబుతున్నారు.

ఒక పిచ్చివాడు రైలువేగాన్ని చప్పుడునీ మించేటట్టుగా కంఠమెత్తి పాడుతున్నాడు. త్యాగరాజ కృతికీ, సినిమా పాటకీ, చాలా అసందర్భంగా వివాహం చేయించేశాడు అందరూ నవ్వుతున్నారు. నేను మధ్య మధ్య దినపత్రికనీ, నా పక్క కాస్త దూరంలో కూర్చున్న యువతినీ చూస్తున్నాను. పత్రికలోకన్నా యీవిడలో నాకు వార్త లెక్కువ కనిపిస్తున్నట్లు అనుమానంవేసింది. ఆవిడ తన కెదురుగా కూర్చున్న ఒక గ్లాస్కోచొక్కాకేసి చూసి అర్థవంతంగా నవ్వుతోంది. చీటికీ మాటికీ చెయ్యెత్తి సిగలో పువ్వులు సర్దుకుంటోంది. జెరదా కిల్లీ వేసిన గ్లాస్కోచొక్కావాడి నల్లని మొహంలో ఎర్రని పెదవులు నెత్తురుబికిన గాయంలా వున్నాయి. అతని జేబులో జేబుకన్నా పెద్దదయిన పర్సూ, ఒక సిల్కురుమాలా వున్నాయి. తలకి రాసిన అత్తరు కొంచెం చెంపలమీదికి స్రవిస్తోంది. చిన్నప్పట్నుంచీ సరసం తెలిసిన మొరకవీధి రసజ్ఞుడిలావున్నాడు. కాస్సేపటికి అన్నాడు యువతితో ''ఏవూరు:'' అని.

యువతి యిటూ, అటూ చూసి ''బిక్కవోలు'' అంది. సరసుడు మెల్లగా ''యింకేం'' అన్నాడు. యువతి ఫక్కున నవ్వింది. అకారణంగా పైట సవరించుకుంది.

పిచ్చివాడు గట్టిగా, పిచ్చిగా మాట్లాడుతున్నాడు. ''నాకు మాటలు రావు. మాటలు తిరగబడిపోతున్నై. నాకు ఆకలి. నేను మాటల్ని తినేస్తున్నాను.''

శాస్త్రిలు కళ్ళుమూసుకుని పాడుకుంటున్నాడు. ''నహి నహి రక్షతి డుకృఞ్ కరణే భజగోవిందం భజగోవిందం మూఢమతే....'' ''పసుపు ధర ఎలా వుంది శాస్త్రిలూ మీ వూళ్ళో?'' అంటున్నాడు వర్తకుడు. బెంగాలీవాడు చచ్చు యింగ్లీషులో విద్యార్థులతో ఏవో గొప్పలు చెప్తున్నాడు. ఒక్క విద్యార్థి మాత్రం చాకలెట్లు ఒకటి తర్వాత ఒకటి తింటూ కిటికీలోంచి అవతలకి చూస్తున్న ఆంగ్లో ఇండియన్ యువతి గుండ్రని పిక్కలవైపే చూస్తున్నాడు.

పిచ్చివాడు తన పిరుదులమీద చేత్తో తాళంవేస్తూ పాడుతున్నాడు.

"ఎంతగతి పట్టెరా నీకు శ్రీరామచంద్రా
ఎంతమతి పోయెరా నీకు శ్రీరామచంద్రా"

"అయ్యో. నా పేరు రామచంద్రమూర్తి. నాకు పిచ్చని మావాళ్ళందరూ అన్నారు. పిచ్చివెధవ ఎవడేనా యింత గొప్పగా పాడతాడా సహాబ్" అంటూ తొడ చరిచాడు.

"ఈసారి ఎన్నికలలో కాంగిరేసు నెగ్గుదా?" చుట్ట ఆసామీ అంటున్నాడు.

"యాడు నెగ్గితె ఏంలే. మనూరికి మాత్రం ఒంతెన పడదు" మరొహడు.

"నా వోటు మాత్రం ఎవడు నెగ్గితే వాడికే" అన్నాడు వర్తకుడు పెట్టెతాళం లాగి చూసుకుని.

"నీ కెలా తెలుస్తదీ యాడు నెగ్గేదీ?" చుట్ట ఆసామీ ప్రశ్న.

"నెగ్గింతర్వాతే నేను నా వోటు వేస్తాను. లేందే వెయ్యనే వెయ్యను."

ఇద్దరు ముగ్గురు పగలబడి నవ్వారు. ఈసారివిశ్వస్త అవగుంఠనం కాస్త సరిచేసుకుని, "స్టేషన్ వచ్చిందా నాయినా?" అంది కళ్ళు మూసుకునే.

"ఏ స్టేషనండీ?" అన్నాడు విద్యార్థి.

విశ్వస్త సమాధానం చెప్పలేదు. మళ్ళీ చటుక్కున సమాధిలోకి వెళ్ళిపోయింది.

ఏదో స్టేషన్ వచ్చింది. చుట్టా, బీడీ, సోడా-కేకలు. విద్యార్థులు రైలుదిగి ప్లాట్‌ఫారంమీద అటూ యిటూ తిరుగుతున్నారు. కొత్త వాళ్ళెవరూ ఈ పెట్టెలో ఎక్కలేదు. గ్లాసోక్కచొక్కావాడు రెండుఫ్రింకుళు

కొన్నాడు. ఒక డ్రింకు యువతికి అందించాడు. ఆమె ఆశగా డ్రింకుకేసి చూస్తూ "వద్దండీ" అంది.

"తీసుకో చల్లగా వుంటుంది. గాడుపు దెబ్బకూడా" ఎంతో ఆప్యాయంగా గ్లాస్కోవాడు అన్నాడు. ఆమె తీసుకుంది. వర్తకుడు లేచి శాస్త్రులుతో, "పెట్టె చూస్తూవుండు శాస్త్రులూ, యిప్పుడే వస్తా" అన్నాడు.

"ఎక్కడికీ?" శాస్త్రులు.

"ఒంటేలుకి" – వర్తకుడు.

ఆంగ్లోయిండియన్ యువతి గబుక్కున లేచి కీచుగా ఇంగ్లీషులో అడిగింది. ఎవరి నుద్దేశించో తెలియదు. "చాక్లెట్స్ ఎవైలబుల్ హియర్!"

ఆమె పిక్కలకేసి చూస్తూన్న విద్యార్థి ముందుకు గంతువేసి "వాట్ మేడమ్?" అన్నాడు.

మరొక విద్యార్థి శుభ్రమైన తెలుగులో "పిన్ని తగలెయ్యా, పెట్టెడు చాక్లెట్లూ తినేసి యింకా కావాలంటోంది దీనిది కడుపా ఖండవిల్లి మడుగా?" అన్నాడు.

పిక్కలవిద్యార్థి సవినయ సవిషాదంగా "ఇక్కడ దొరకవండి" అన్నాడు. అతడు గబుక్కున అలా అంటూ యేడుస్తున్నాడేమో అని నాకు భయం వేసింది.

గార్డు విజిల్ ఊదాడు. రైలు కదిలింది. వర్తకుడు వచ్చి యథాస్థానంలో కూర్చున్నాడు. పిచ్చివాడు వాగుతున్నాడు. "నా పెళ్ళాం స్టాయేబుతో లేచిపోయింది. నా కొడుకు పారిపోయాడు. హ హ్హా హ యెందుకో చెప్పుకోండి. మొదటి బహుమతి లక్షరూపాయలు. రెండవ బహుమతి పదిలక్షలు...."

"ఏమయ్యోయ్ సెట్టీ రేపు వైశాఖంలో నీ తండ్రి తద్దినం-మరచి పోకూడదు. ఆరోజుకి నేను వస్తాను" అన్నాడు శాస్త్రులు. "ఓరి తద్దినం తగులడా. అప్పుడే ఏడాది తిరిగిపోయిందాః" వర్తకుడు కాలవేగానికి ఆశ్చర్యపోతున్నాడు.

బెంగాలీవాడు అంటున్నాడు "మా మిడ్నపూర్‌లో ప్రతీవాడూ విప్లవవాది ప్రతీవాడూ కొన్ని వందల బాంబులు తయారు చేశాడు. చంపేందుకు, ఇంగ్లీషువాళ్ళు కనపడకపోతే వాళ్ళలోవాళ్ళే ఒకళ్ళ గొంతుకలు చంపేసుకున్నారు."

"మహా వీరులండి" అన్నాడొక విద్యార్థి.

గ్లాస్కో-చొక్కా-వాడు ముందుకు వంగి "రాత్రికి రానా?" అంటున్నాడు. యువతి కళ్ళు కుంచించి చిత్రంగా కొంటెగా చూచి చిన్న నవ్వు నవ్వి మొహం పక్కకు తిప్పింది.

నేను పేపర్లో చదువుతున్నాను. "ఇండియాలో మనిషి సగటు ఆదాయం చాలా తక్కువ, అమెరికాతో బ్రిటన్‌తో పోలిస్తే వీళ్ళు ఏం తిని బ్రతుకుతున్నారా అనిపిస్తుంది. ఇక్కడ సగటు జీవిత పరిమాణం యిరవై మూడు ఏళ్ళు...."

మెయిలు వేగం హెచ్చింది చిన్న చిన్న స్టేషన్లని ఖాతరు చెయ్యకుండా రైలు వెళ్ళిపోతోంది. వడగాలికి రైల్లోవాళ్ళ మొహాలన్నీ మాడినట్టుగా కనిపిస్తున్నాయి. శాస్త్రులు సంచిలోంచి మామిడిపండు తీసి తింటున్నాడు. విధవ మళ్ళీ కళ్ళు తెరిచి "స్టేషనొచ్చిందా నాయనా ?" అంది. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. వెలుగిటు తగ్గిపోతోంది. మసకగా చీకటి కమ్ముకుంటోంది.

హఠాత్తుగా రైలు ఆగింది. కారణం ఏమిటా అని అందరూ కిటికీలలోంచి తొంగి చూశారు. గార్డు కంగారుగా ముందుకి వెడుతున్నాడు. జనం గుంపులుగా వెనకాలే వెళుతున్నారు. రైలు ముందు పెట్టెలవైపు

కలకలం. ఏవో మాటలు, ఆశ్చర్యార్థకాలు, విహ్వలాక్రోశాలు, వర్తకుడు భయంతో పెట్టె తాళం లాగి చూసుకున్నాడు, ఎవరో కొందరు వెనక్కి వచ్చేస్తున్నారు.

"ఏం జరిగింది? ఏం జరిగింది?" అన్నాడు బెంగాలీ.

"స్యూసైడ్, స్యూసైడ్" - జనంలోంచి ఎవరో కేక.

గబగబా కొందరు పెట్టెలోంచి దూకి యింజనువైపుకి పరిగెత్తారు. "రామ రామ" ఎవడో అభాగ్యుడులాంటి మాటలు. శాస్త్రిలు 'ఆత్మహత్యే' అని భయంగా కిటికీలోంచి చూస్తున్నాడు. ఇటూ అటూ పంటచేలు, చెట్లు. దిగిన ఒక ప్రయాణీకుడు మా పెట్టెలోకి వచ్చాడు. వాడి వొళ్ళు వణుకుతోంది. తడబడుతూ "ఘోరం కళ్ళు బైర్లు కమ్మాయి. రామ రామ" అని చతికిలబడ్డాడు.

విధవ ముసుగు సవరించుకుంటూ సగం తెరిచీ, సగం మైకంలో అంది "ఏం పొయ్యేకాలం? ఘోరకలి ఉన్నట్టుండి వాడికీ ఎంత ధైర్యమో యీ అఘాయిత్యం చెయ్యడానికి."

"కాలమే అంతలెండి బొత్తిగా దిగజారిపోయింది. ఎందుకు చెప్పండి, ఈ వెధవ ఆత్మహత్యలూ, ఆత్మస్తుతులూన్నూ! తెగతిని ఏ పెళ్ళాంతోనో ముండతోనో దెబ్బలాడి ఉక్రోషంతో ఇలా చస్తారు" అన్నాడు శాస్త్రిలు.

వర్తకుడు అంటున్నాడు - "ఇటువంటివాళ్ళు చచ్చిపోవడమో, చంపడమో చేస్తారు శాస్త్రిల్లూ. మా తమ్ముడి బామ్మరిదికి బాకీ వుండి రొక్కంచి అడిగాడని గొడ్డలి తీసుకొచ్చి చంపబోయాడు రౌడీ ఎదవ. తప్పిందికానీ ఈపాటికి పరలోకంలో వుండేవాడు. మా తమ్ముడి బామ్మరిది అయితే మావాడు దద్దమ్మలా వూరుకున్నాడనుకునేవ్. అబ్బే కోర్టుల్లో దావా పడేసి, నిముషాలమీద జైల్లో పడేయించాడు. వాడు జైల్లో వున్నట్టుండి ఒక రోజున విషం తాగి చచ్చాడు పీడా వదిలింది." యువతి మాత్రం ఏదో కంగారుగా బిక్కుబిక్కున చూస్తోంది. ఈ వార్త ఆమెను

చాలా భయపెట్టినట్లుంది. అంతకుముందు విలాసాలు, ఒయ్యారాలు చిలికే ఆవిడ బిగుసుకుపోయింది. మొహంలో నెత్తురులేదు. ఆశ్చర్యంగా చూస్తున్నాను. గ్లాస్కోచొక్కావాడేదో చెప్పబోతున్నాడు. ఆమె వినలేదు.

"భయంగా వుందా ?" - గ్లాస్కోచొక్కా ఉవాచ.

"పాపం" - అందామె శూన్యంలోకి చూస్తూ.

అందరూ పెట్టెలోకి తిరిగివచ్చారు. అందరూ కంగారుగా ఒకర్ని మించి మరొకరు మాట్లాడుతున్నారు గార్డు చాలా ప్రముఖంగా తల పంకిస్తూ, పక్కనున్న కుతూహలపరులకి జవాబులు చెప్తూ వస్తున్నాడు.

"ఏమయింది ?" అన్నాడు ఒకడు మరో పెట్టెలోంచి.

"పోయాడు" - ఒక గొంతు.

"ఏం ?"

"వాడి ఖర్మ."

రైలు కూత వేసింది. శవందగ్గర సెలవు అడిగినట్టు వడగాలి కొంచెం తగ్గింది. రైలు కదిలింది.

"సచ్చినోడు నల్లగా ఉన్నాడు. ఉంగ్రాల జుట్టుంటే మావోడేమో అని హడలిపోయాను. మావోడు ఈడెక్కడో కూలిపనికనొచ్చాడు" అంది ఒక పడుచు రొప్పుతూ.

"నీవోడు కాదా ?" - ఒక పేరయ్య.

"అబ్బే, ఆడెవడో.... యెర్రిముండాకొడుకు."

"పాపం" అన్నాడు పేరయ్య ఆశాభంగంతో.

బెంగాలీతో విద్యార్థులు ఉద్రేకంగా చర్చిస్తున్నారు.

"ఆత్మహత్యేనంటారా ?" అన్నాడొక విద్యార్థి.

"ఇన్‌టెన్షన్‌తో చచ్చిపోతే ఆత్మహత్య, లేనిదే యాక్సిడెంట్" బెంగాలీ.

"రైలు గుండెలమీదనుండి పోయింది"—మరొకడు.

"జఠరికలు పూర్తిగా నలిగిపోయాయి."

"ప్లీహం పిప్పిఅయిపోయింది." వీళ్ళిద్దరూ ఫిజియాలజీ యింకా మరచిపోని విద్యార్థులు.

"కలకత్తాలో ఆత్మహత్యలు ఎక్కువ" - సగర్వంగా అన్నాడు బెంగాలీ, కలకత్తా ప్రాముఖ్యత కిదే కారణమన్నట్లు.

"ఎందుకు చచ్చిపోయాడంటారు ?" జిజ్ఞాసుడైన ఒకాయన బెంగాలీని ప్రశ్నించాడు.

"ఆc—ఆయుర్దాయం మూడింది, చచ్చాడు. ఏం వుంది" అన్నాడు చుట్ట ఆసామీ.

"నిరాశావాదం ఎక్కువయింది దేశంలో. విదేశ నాగరికత దీనికి కారణం" అన్నాడు బెంగాలీ.

"జపాన్‌దేశంలో హరకిరి చేసికొని రోజుకి కొన్నివందల మంది సుఖంగా, ధైర్యంగా చచ్చిపోతారుట" ఒక మిడిల్‌స్కూలు మేష్టారు.

"ప్రతీ సంఘటనకీ" స్త్రీ పురుష సంబంధం ఉంటుందని అన్నాడు ఫ్రాయిడ్. ఎవతో మోసగించివుంటుంది. తట్టుకోలేక చచ్చిపోయాడు" అన్నాడు బెంగాలీ,

"విఫల ప్రేమ అయివుంటుంది" అన్నాడు రొమాంటిక్ వూహాలున్న పిక్కల విద్యార్థి.

విధవ మళ్ళీ సగం కళ్ళు తెరిచి అంది. "ఈ ప్రాణం ఎంత సేపమ్మా - బుద్బుదప్రాయం. అయినా రైలుకిందపడి ఎవణ్ని ఉద్ధరించనూ"

గ్లాస్కో చొక్కావాడు యువతికేసి చూసి ఆశ్చర్యపోతున్నాడు. యువతి పెదాలు వణుకుతున్నాయి. బలవంతంగా ఏడుపు నాపుతున్నట్లుంది.

"అట్లాగున్నావేం - ఒంట్లో బాగోలేదా?" అన్నాడు గ్లాస్కో చొక్కా. యువతి తలూపింది. నే నామెను పరీక్షగా చూడడం చూసి తల దించేసింది.

ఆంగ్లో ఇండియన్ యువతి బొమ్మల పత్రిక చదువుతోంది. తల పైకెత్తి "హూ యీజ్ది డెక్ మాన్?" అంది మొత్తం పెట్టెలోని అందర్నీ ప్రశ్నిస్తూ.

రైలు స్టేషనులో ఆగింది. ఆంగ్లో యిండియన్ యువతి "కూలీ కూలీ" అని పిలుస్తోంది. ఎవ్వరూ రాలేదు. పిక్కల విద్యార్థి లేచి "మే ఐ హెల్ప్ యు మేడమ్" అంటూ ఆమె సూట్‌కేస్ సవినయంగా ఆమెకు అందించాడు. ఇంతలో, ఆమెని ఆహ్వానించే ఇంకొక స్వజాతి యువకునితో కరచాలనం చేస్తూ చేతో సూట్‌కేసూ, సంచీ పుచ్చుకుని కృతజ్ఞత అయినా చెప్పకుండా ఆమె వెళ్ళిపోయింది వెళ్ళిపోయే పిక్కలవైపు వెర్రిగా విరహంగా చూసి విద్యార్థి వెనక్కి తిరిగాడు.

బొత్తాలులేని లాల్చీ, ముక్కునుంచి జారి పడిపోతుందేమో అన్న కళ్ళజోడుతో ఒక సన్నని, ఎర్రని మనిషి పెట్టెలోకి వచ్చాడు. జుట్టు చెంపలదగ్గిర నెరసింది. గాడుపులో తిరిగినట్టు మొహం వడలిపోయింది.

"నమస్కారం, మీలోఎవరైనా శవాన్ని దగ్గిరనుండి చూశారా?" అన్నాడు పెద్దగా.

"మేం మేం" అన్నారు విద్యార్థులు హుషారుగా.

లాల్చీఆయన చిరునవ్వు నవ్వాడు. చెవిలో పెన్సిలు తీసి అరచేతిలో కొట్టుతూ "దయచేసి వివరాలు - శవాన్నిగురించి, రూపం, రంగూ, చూసినవీ, విన్నవీ తెలియజేస్తారా?" అన్నాడు.

"మీ రెవరు?"

"నేను పత్రికా విలేఖరిని."

"అక్కడికిపోయి చూసుకోవయ్యా" అన్నారు విద్యార్థులు. "చూడండి బాబూ మా గ్రామానికి పదిసంవత్సరాలనుండీ నేనే విలేఖర్ని నెలకి పదిహేనురూపాయలు పంపిస్తారు. ఇప్పటికి రెండేళ్ళనుండి, ఈ ప్రాంతాలనుండీ ఒక వార్త పంపలేకపోయాను. ఈ పోస్టు రద్దుచేస్తా మంటున్నారు."

"మరి యీ గ్రామానికి విలేఖరి ఏమిటయ్యా?"

"ఇదివరలో ఇక్కడ రెండుమూడు కాంగ్రెస్‌వాళ్ళ ఆశ్రమాలు. ఖాదీ వుత్పత్తి కేంద్రం అన్నీ వుండేవి. ఎవరో నాయకులు వస్తూండే వారు. అందుకోసం నన్ను నియమించారు. ఇప్పుడా సంపదలు లేవు. పైగా వూళ్ళో రెండు పార్టీలు. ప్రతిగొడవా ఏదో ఒక పార్టీకి చెంది వుంటుంది. వీళ్ళ వార్త పంపితే అవతలవాళ్ళకి కోపంవచ్చి తంతా మంటున్నారు. ఇన్నాళ్ళకి ఈ నాన్‌పార్టీ వార్త తగిలింది. బాబ్బాబు, అంత దూరం పోలేను. గార్డు నడిగితే చెప్పడం లేదు. దయచుంచి.... కళ్ళజోడు పైకి తోశాడు విలేఖరి. విద్యార్థులూ, ఇంకా చూసినవాళ్ళూ ఏవేవో చెప్పారు. కదలబోతూన్న రైలులోంచి దుమికి కంగారుగా వెళ్ళిపోయాడు.

రైలు మళ్ళీ కదిలింది. విద్యుద్దీపాలు వెలిగాయి. ఇంతవరకూ యేమీ ఎరగనట్టు ఒక మూల కూర్చున్న పిచ్చివాడు, అమాంతం లేచాడు "చచ్చాడా, చచ్చినాడా, చచ్చిపోయినాడా?" అన్నాడు వెర్రిగా నవ్వుతూ.

"కలి, ఘోరకలి" అన్నాడు శాస్త్రులు జారి చెంబులోని నీళ్ళు కాసిని దాహం పుచ్చుకుంటూ.

"కరి కాదు శాస్త్రిలూ, ఆకలి, రోకలి" అంటూ పిచ్చివాడు శాస్త్రిలుమీద ఒరిగాడు. శాస్త్రిలు పిచ్చివాణ్ని 'ఛో ఛో' అని తోశాడు. పిచ్చివాడు ఆ తోపుకి బెంగాలీమీద పడ్డాడు. బెంగాలీ 'గెట్ అవుట్' అని మళ్ళీ తోశాడు. పిచ్చివాడి తలకి రైలుపెట్టె గోడ తగిలింది. 'అబ్బా' అన్నాడు. అందరికేసీ చూశాడు. నోరు మూసుకున్నాడు. "మాట్లాడను, ఇంక మాట్లాడను" అన్నాడు జాలిగా.

"పిచ్చిముండాకొడుకు పాపం" అన్నాడు చుట్ట ఆసామి. "మీరందరూ మనుషులు, మనుషులంతా ప్రపంచం ప్రపంచమనే రైలు బండి ఇప్పుడు నామీదనుంచి పోయింది. చూడండి, ఎంత దెబ్బ తగిలిందో - మాట్లాడను, నేను చచ్చిపోయాను. రైలు కిందపడి చచ్చిపోయింది. నేనే హరోం హరహర" అంటూ గోడకి చేర్లబడి కళ్ళు మూసేసుకున్నాడు పిచ్చివాడు.

అందరూ నవ్వారు.

"శాంతారాం పిక్చరాడుతోంది మా వూళ్లో" అన్నాడు విద్యార్థి. వాళ్ళటాపిక్ సినిమాలలోకి వెళ్ళిపోయింది. చుట్ట ఆసామీ వ్యవసాయాన్ని గురించి శాస్త్రిలుతో మాట్లాడుతున్నాడు. విధవ మగతగా తూగుతూ మధ్య మధ్య కళ్ళు తెరుస్తూ నిద్రపోతోంది. బెంగాలీవాడు ఒక సీసా తీసి రసగుల్లాలు తీసుకుని తింటున్నాడు.

నేను పేపరునుంచి నా దృష్టిని పక్కకు మరల్చాను. యువతి చెక్కిళ్ళమీద సన్నని నీటిచార, గ్లాస్కోచొక్కావాడు జేబులో పర్సు తీసి - మరి యువతిని ఆకర్షించడానికో ఏమో నోట్లు లెక్కపెట్టుకుంటున్నాడు. కాని యువతి దిగులుగా వుంది నాకు చాలా వింతగా అనిపించింది. ఈమెలో ఈ మార్పుకి కారణం ?

విధవ కళ్లు తెరచి "ఏ స్టేషనూ వచ్చేది."

ఈసారి శాస్త్రిలు అన్నాడు "బిక్కవోలు"

"ఊహుం - బోడారం రాగానే చెప్పు నాయనా" - మళ్ళీ అడు కుంది విధవ.

"ఇక్కడెక్కడ బోడారం. కానా రాత్రి పడుద్ది" అన్నాడు చుట్ట ఆసామి.

బిక్కవోలు స్టేషను వచ్చింది. రైలు ఆగింది. యువతి చప్పున కన్నీళ్ళు తుడుచుకుని చేతిసంచీ పుచ్చుకొని లేచింది. గ్లాస్కోచొక్కా మెల్లగా "ఏమంటావ్ నేనుకూడా దిగనా ?" అన్నాడు.

యువతి తీవ్రంగా చూసింది. కళ్ళల్లో అసహ్యం. వాడి సూదుల్లా గుచ్చుకున్నాయి నిరసనగా తలపంకించి గబగబా దిగి వెళ్ళిపోయింది. గ్లాస్కోలాల్చీవాడు ఎర్రగాయాల్లాంటి రెండు పెదవుల్నీ ఆప్పళించి తెల్లబోయి చూశాడు

మళ్ళీ రైలు కదిలింది. చీకట్లో దూసుకుంటూ వెళ్ళిపోతోంది. నేను పేపరు చదువుకుంటున్నాను. రైలు చప్పుడు అదేపనిగా వినడం వలన మనసులో ఒక స్వభావంలాగ అయిపోయింది. ఇంతకీ ఏమీ లేదు.... సంగతి చెబుతున్నాను.

(1961)